క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో స్వాతి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక తెలుగుపేటలో వెలసిన శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామునే స్వామివారి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, స్నపన తిరుమంజనం, పంచామృతాభిషేకాల అనంతరం పట్టువస్త్రాలతో అలకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. అలాగే శ్రీ మహాలక్ష్మీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, సామూహిక కుంకుమార్చన చేపట్టి మహామంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆలయ ఆవరణంలో స్వామివారి ఉత్సమూర్తులకు పల్లకీ సేవను జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీరామమూర్తి, మధుసూదన్‌రాయల్ పాల్గొన్నారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేసి హారతులు పట్టారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చుక్కల భూముల గుర్తింపు

ఉయ్యాలవాడ : ప్రభుత్వం చేపట్టే భూ సర్వేలో భాగంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆదివారం చుక్కల భూములు గుర్తింపు కార్యక్రమాన్ని చేపట్టారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ మండలంలో మొదటి విడతగా సుద్దమల్ల, పెద్దయమ్మనూరు, ఉయ్యాలవాడ, మాయలూరు గ్రామాల్లో చుక్కల భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ప్రారంభించామన్నారు. 21 రెవెన్యూ గ్రామాల పరిధిలో 27 మంది రైతులకు సంబంధించి 250 ఎకరాల విస్తీర్ణంలో చుక్కల భూమి ఉందని ప్రాథమిక అంచనా వేశామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు వెంకటస్వామి, తులసీకృష్ణ, ఆర్‌ఐ సత్తార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ:మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కొండుపల్లె, ఇంజేడు,అక్కంపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 నుంచి సాయంత్రం 3 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

మారిన వేళలు..

దొర్నిపాడు: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం నుంచి త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని ఏఈ రామసుబ్రహ్మణ్యం ఆదివారహ్మో ప్రకటనలో తెలిపారు. భాగ్యనగరం, కొండాపురం, రామచంద్రాపురం, అమ్మిరెడ్డినగరం, అర్జునాపురం, చాకరాజువేములు, డబ్ల్యూ కొత్తపల్లె, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు 9గంటల పాటు త్రీఫేస్ విద్యుత్‌ను సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

85 కేసులు పరిష్కారం

శిరివెళ్ల: మండలంలో 85 కేసులు పరిష్కారమయ్యాయని ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ నెల 11వ తేదీన ఆళ్లగడ్డ కోర్టులో జరిగిన మెగా లోక్‌అదాలత్‌లో విచారణ చేసి రాజీమార్గంలో కేసులు పరిష్కరించారని చెప్పారు.

ఒత్తిడిని అధిగమించడంపై అవగాహన పెంచుకోవాలి

ఆళ్లగడ్డ: ఒత్తిడిని అధిగమించడంపై అవగాహన పెంచుకోవాలని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ తివిక్రమ్ పేర్కొన్నారు. పట్టణ శివారులో ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన రోటరీ ఆరోగ్య వేదికను ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో ఒత్తిడిని అధిగమించకపోతే మధ్య వయస్సు నుంచే అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆళ్లగడ్డ రోటరీ సభ్యులు ఏర్పాటు చేసిన ఆరోగ్య వేదికను సద్వినియోగం చేసుకుంటూ వ్యాయామం, యోగా, ధ్యానం లాంటి వాటిని సాధన చేయాలని సూచించారు. రోటరీ ప్రెసిడెంట్ హరీష్ బాబు, సెక్రటరీ దస్తగిరిరెడ్డి, డాక్టర్ రామగోపాల్‌రెడ్డి ఉన్నారు.

కొత్తూరులో భక్తజన సందడి

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరులో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. మాఘమాసం కావడంతో భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఆలయానికి చేరుకున్న భక్తులు పిండి పదార్థాలు తయారు చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

పలువురు విరాళం

కర్నూలులో నివాసముంటున్న ఈర్నపాడు గ్రామానికి చెందిన పిట్టం నాగ సుధాకర్‌రెడ్డి రూ.50వేలు , పిట్టం తరలితరెడ్డి రూ.10 వేలు, నంద్యాల పట్టణానికి చెందిన ధరణి నాగేంద్ర రూ.10వేలను అన్నదాన పథకానికి విరాళంగా ఇచ్చినట్లు ఈఓ రామక్రిష్ణ తెలిపారు. గడివేముల మండలం కరిమద్దెల గ్రామానికి చెందిన ఆకుమళ్లబాబు 5 గ్రాముల బంగారు పడిగెను వితరణగా ఇచ్చారు.

గ్రామాలకు కొత్త రూపు

- కార్యాలయాల నిర్మాణాలతో పట్టణ కళ
- మండలానికి 12 గ్రామ సచివాలయాల మంజూరు
- ఆరు భవనాల నిర్మాణాలు పూర్తి
- స్థానికంగానే ప్రభుత్వ సేవలు
- ప్రజలకు తప్పిన ఇబ్బందులు



ఎం.కృష్ణాపురంలో పూర్తయిన సచివాలయ భవనం


గోస్పాడులో చివరి దశలో పనులు జరుగుతున్న దృశ్యం

గోస్పాడు: గాంధీజీ స్వరాజ్య స్థాపనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు గ్రామంలోనే పాలన అందుబాటులో ఉండాలని గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఇందులో భాగంగా గ్రామాల్లో భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి సిబ్బందిని సైతం నియమించింది. ఇప్పటికే చాలా చోట్ల సేవలు అందుబాటులోకి రాగా కొన్నిచోట్ల భవనాల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. వీటికి తోడు సచివాలయాలకు అనుబంధంగా ఆర్‌బీకేలు,పాల శీతలీకరణ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, గోడౌన్లు తదితర వాటిని నిర్మిస్తున్నారు. దీంతో గ్రామాలకు పట్టణ కళ వచ్చింది. అధునాతన నిర్మాణాలు, కార్యాలయాల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండటంతో పట్టణాల్లో అందుబాటులో ఉన్న సేవలన్నీ గ్రామ ముంగిటకే చేరాయి. దీంతో వివిధ పనుల నిమిత్తం మండల, నియోజకవర్గ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా సేవలందుతుండటంతో వారికి ఇబ్బందులు తొలిగాయి.

12 సచివాలయాలు మంజూరు..

గోస్పాడు మండలంలోని గ్రామాలకు 12 సచివాలయాలు మంజూరయ్యాయి. అందులో దీబగుంట్ల, నెహ్రూనగర్, కానాలపల్లె, ఎం.కృష్ణాపురం, సాంబవరం గ్రామాల్లో భవనాల నిర్మాణాలు పూర్తి కాగా అవి వినియోగంలోకి వచ్చాయి. జూలేపల్లెలో భవన నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. అలాగే పసురపాడు,ఒంటివెలగల, గోస్పాడు, యాళ్లూరు-1 గ్రామాల్లో భవన నిర్మాణాలు 85 శాతం పనులు పూర్తయ్యాయి. యాళ్లూరు-2, జిల్లెల్ల గ్రామాల్లో పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

నిధుల మంజూరు ఇలా..

సచివాలయ భవనాల నిర్మాణం కోసం దీబగుంట్లలో రూ.25లక్షలు, నెహ్రూనగర్, జిల్లెల్ల గ్రామాల్లో ఏర్పాటు చేసే సచివాలయాలకు రూ.35లక్షలు మంజూరు కాగా మిగిలిన వాటన్నింటికి ఒక్కో భవన నిర్మాణానికి రూ.40లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. వీటి ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి సచివాలయంలో ఉద్యోగుల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

పనులు త్వరలో పూర్తి చేస్తాం



గ్రామాల్లో చేపట్టిన సచివాలయ భవనాల నిర్మాణాలు ఇప్పటికే పలు పూర్తయ్యాయి. మిగిలిన వాటి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పూర్తిస్థాయిలో నిర్మాణం అయిన భవనాల్లో కార్యాలయ విధులు కూడా నిర్వహిస్తున్నారు. మిగిలిన భవనాల నిర్మాణం త్వరలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం.

–రాజశేఖర్‌రెడ్డి, ఏఈ, గోస్పాడు

17 నుంచి ఓంకారంలో బ్రహ్మోత్సవాలు


ఓంకార క్షేత్రం

బండిఆత్మకూరు: ఓంకార క్షేత్రంలో ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఈఓ నాగప్రసాద్, విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. 17న బండిఆత్మకూరులోని శివాలయం నుంచి ఉత్సవ విగ్రహాలు మంగళ వాయిద్యాల మధ్య క్షేత్రానికి బయలు దేరాతాయని, 18 ఎరకలకాలనీ, శింగవరం, సోమయాజులపల్లె గ్రామాల్లో గ్రామోత్సవాల అనంతరం ఓంకార క్షేత్రం చేరతాయని చెప్పారు. ఆరోజు రాత్రి లింగోద్భవ కాలంలో మూలవరులకు మహాన్యాస రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, ఉత్సవ మూర్తులకు కల్యాణం జరిపిస్తామన్నారు. 19న నంది వాహనంపై ఆది దంపతుల ఊరేగింపు, 20 సాయంత్రం రథోత్సవం, 21న వసంతోత్సవం, 22న ఆదిదంపతులు ఓంకారం నుంచి బండిఆత్మకూరు శివాలయానికి చేరుకుంటారని వివరించారు.

లోక కల్యాణం కోసం చండీ హోమం


ప్రత్యేక అలంకారంలో గాయత్రీ మాత


చండీ హోమంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రథమనందిలో వెలసిన గాయత్రీ ఆలయం 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం ఆదివారం చండీ హోమం నిర్వహించారు. ఉదయాన్నే గాయత్రీ దేవి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. పండితులు వేదయుక్తంగా చండీ హోమం జరిపించి పూర్ణాహుతి గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. సమాఖ్య అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి నగర దోన సుధీర్, కేశవ మూర్తి, విద్యాసాయినాథ్, సురేంద్రనాథ్, రేణుక పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీభద్రకాళీ సమేత వీరభద్రస్వామి,గ్రామోత్సవం నిర్వహిస్తున్న వీరశైవ సంఘం నాయకులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక బైర్మల్ వీధిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవస్థానం ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం శ్రీ వీరభద్ర స్వామి సేవాసమితి, పట్టణ వీర శైవ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.ఉదయాన్నే స్వామివారి మూల విరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా వీరశైవులు ప్రదర్శించిన నందికోల సేవ, ఖడ్గ ఉచ్చారణ అలరించాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సాంబయ్య, ఈశ్వరప్ప, రాజు, శ్రీనివాసులు, నాగేంద్ర, శంకరప్ప, సురేష్, మల్లికార్జున, వీరభద్రప్ప పాల్గొన్నారు.

ఊరూరా అన్నదాన శిబిరాలు

జూపాడుబంగ్లా: కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులకు అన్నదానం, అల్పాహారం, మజ్జిగ, పండ్లు పంపిణీ వంటి కార్యక్రమాలు చేస్తూ దాతలు భక్తుల సేవలో తరిస్తున్నారు. ఈనెల 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కర్ణాటక, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి శివ మాలధారులు, భక్తులు కాలినడక భ్రమరాంబమల్లిఖార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు వెళ్తున్నారు. కాలినడకన వెళ్తున్న వారి ఆకలి, దప్పులను తీర్చేందుకు గ్రామాల్లో అన్నదాన శిబిరాలు ఏర్పాటుచేశారు. బ్రాహ్మణ కొట్కూరు, బొల్లవరం, నందికొట్కూరు జమ్మిచెట్టు, మండ్లెం పుల్లయ్యబావి, తంగడంచ, జూపాడుబంగ్లా శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, పాములపాడు, కరివేన ఎస్సార్బీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో అన్నదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. మరి కొందరు దాతలు భక్తులకు మజ్జిగ, పండ్లు పంపిణీ చేస్తున్నారు.


తంగడంచ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరం

అప్పర్ భద్ర పూర్తయితే సీమ ఎడారే

నంద్యాల(అర్బన్): కర్ణాటక ప్రభుత్వం అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తే రాయలసీమ జిల్లాలు ఎడారిగా మారే అవకాశం ఉందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రటిక్ జిల్లా కార్యదర్శి నరసింహులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు మొదటి దశ నిర్మాణం పూర్తయితే 17 టీఎంసీల నీరు, రెండో దశ పూర్తయితే 29 టీఎంసీల నీటిని కర్ణాటక ప్రభుత్వం తోడేసుకుంటుందని, తద్వారా దిగువన ఉన్న సీమ జిల్లాల రైతులు సాగునీటి కష్టాలు పడాల్సి వస్తుందన్నారు. స్థానిక కార్యాలయంలో డివిజన్ కార్యదర్శి శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అపర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5,300 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆ ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రఫీ, చౌడప్ప, ఫరూక్, ఖాజామియా, కలాం, శామేల్, నవీన్, దస్తగిరి, వినోద్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(అర్బన్): సంత్ శ్రీ సేవా లాల్ మహరాజ్ 284వ జయంతి ఉత్సవాలను బంజారాలు జయప్రదం చేయాలని గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ కోరారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం చెర్లోపల్లిలోనున్న సేవాఘడ్‌లో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగే జయంతి ఉత్సవాల పోస్టర్లను నాయకులతో కలిసి ఆదివారం విడుదల చేశారు. బంజార ధర్మరక్ష సమితి జిల్లా అధ్యక్షుడు చందునాయక్, అడ్వకేట్ పాలునాయక్, మాత్యనాయక్, మహేష్‌నాయక్, బాబునాయక్ పాల్గొన్నారు.

కారును ఢీ కొన్న టిప్పర్


దెబ్బతిన్న కారు

దొర్నిపాడు: మండలంలోని భాగ్యనగరం సమీపంలో కారును టిప్పర్ ఢీ కొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. ఏఎస్‌ఐ మౌలాలి తెలిపిన వివరాల మేరకు.. ఏపీ 07సీడబ్ల్యూ9605 అనే నంబర్ గల కారు ఆదివారం కోవెలకుంట్ల నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్తుండగా భాగ్యనగరం వద్దకు చేరుకోగానే ఆళ్లగడ్డ నుంచి బనగానపల్లెకు వెళ్తున్న ఏపీ21టీఎక్స్ 8591 నంబర్ గల టిప్పర్ కారును ఓవర్ టేక్ చేయబోయి అతివేగంగా ఢీ కొట్టంది. కారులో ప్రయాణిస్తున్న ఓనర్ అల్తాఫ్‌నకు ఎలాంటి గాయాలు లేకుండా ప్రాణాలతో బయట పడ్డాడు. టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చెప్పారు.

గ్రామీణులకు ఇష్టమైన క్రీడ కబడ్డీ


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): గ్రామీణులకు ఇష్టమైనక్రీడ కబడ్డీ అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు.ఆదివారం మండలంలోని చాపిరేవుల గ్రామంలో నంద్యాల మాజీ మార్కెట్‌యార్డు చైర్మెన్ పురుషోత్తంరెడ్డి తల్లిదండ్రుల /జ్ఞాపకార్థం విద్యార్థులకు నిర్వహించిన కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆటల పోటీల్లో పాల్గొనాలని, విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, గెలుపు ఓటములను సమానంగా స్వీ కరించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చెప్పారంటే.. చేస్తారంతే


ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాను సన్మానిస్తున్న 98 క్వాలిఫైడ్స్

నంద్యాల(వ్యవసాయం): సీఎం జగన్ ఏదైనా మాట ఇస్తే దాన్ని చేసి తీరుతారని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయంలో ఆదివారం త్వరలో ఉద్యోగాలు పొందబోతున్న 98 డీఎస్సీ క్వాలిఫైడ్స్ ఆయనను సన్మానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ పాతికేళ్లుగా ఉద్యోగం కోసం నిరీక్షిస్తున్న డీఎస్సీ క్వాలీఫైడ్స్‌కు సంబంధించి ఇటీవల కేబినెట్‌లో ఆమోద ముద్ర లభించిందని, త్వరలో ఉద్యోగాలు అందుతాయని చెప్పారు. ముఖ్యమంత్రి నిర్ణయంతో రాష్ట్రంలో 4,534 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు రానుండటంతో వారి కుటుంబాల్లో వెలుగులు నిండాలని, వారంతా టీచర్లుగా రాణించాలని, ఉత్తమ విద్యార్థులను తయారు చేసి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని కోరారు. సంఘం రాష్ట్ర నాయకులు సోమసుందర శాస్త్రి, బైరెడ్డి శ్రీనివాసరెడ్డి, తిమ్మారెడ్డి, రామాంజనేయ వరప్రసాద్, నాగరాధిక, ప్రకాష్, లక్ష్మికాంతరెడ్డి పాల్గొన్నారు.

కృష్ణానదిపై బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మించాలి


ఎమ్మెల్యే శిల్పా రవికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్):కృష్ణానదిపై బ్రిడ్జి కమ్ బ్యారేజీని నిర్మించి రాయలసీమ ప్రజల నీటి కష్టాలు తీర్చాలని రాయలసీమ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ రమణారెడ్డి కోరారు. జాతీయ రహదారుల నిర్మాణాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 167–కే హైవే నిర్మాణంలో సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని, ఆ బ్రిడ్జి ద్వారా సీమ ప్రజలు, రైతులకు ఎటువంటి లాభం ఉండదని, ఐకానిక్ బ్రిడ్జి కాకుండా బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి ఏర్పాటైతే కేవలం టూరిజం మాత్రమే అభివృద్ధి చెందుతుంది తప్ప సీమ రైతులకు లాభం లేదన్నారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కాకుండా బ్రిడ్జికమ్ బ్యారేజీని నిర్మించాలని కోరారని గుర్తు చేశారు. దీని ద్వారా 70 టీఎంసీల నీటి నిల్వలను ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. కర్ణాటక ప్రాంతంలో ఆ ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టుతో దిగువనున్న సీమ జిల్లాల్లో నీటి సమస్య ఏర్పడుతుందని, సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీనిచ్చారు.

కురువలు ఐకమత్యంగా ఉండాలి

శిరివెళ్ల: కురువలు ఐక్యమత్యంగా ఉండాలని కర్నూలు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శివన్న కోరారు. ఆదివారం కోటపాడులో కురువ గ్రామ సంఘ కార్యవర్గ ఏర్పాటు చేశారు. గ్రామ అధ్యక్షుడుగా మల్లెల శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా చిలకల లక్ష్మీనారాయణ, సంకల కృష్ణ కిషోర్ తదితరులను ఎన్నొకున్నారు.

సాకారమవుతున్న కల!

- ఏటిపాయవాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి చర్యలు
- రూ. 3.25 కోట్లతో ప్రతిపాదనలు
- 1996లో తీవ్ర వరదల ధాటికి కొట్టుకుపోయిన డ్యామ్
- నాటి నుంచి పట్టించుకోని పాలకులు
- ఎమ్మెల్యే కాటసాని చొరవతో నిర్మాణ దిశగా అడుగులు
- హర్షం వ్యక్తం చేస్తున్న తమ్మరాజుపల్లె గ్రామస్తులు


కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న మైనర్ ఇరిగేషన్ అధికారులు


శిథిలమైన శిలాఫలకం

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె ఎలాంటి నీటి వనరులు లేని గ్రామం. రెండు కొండల మధ్య ఈ గ్రామం ఉంది. దీంతో ఏటా సాగు, తాగు నీటికి అవస్థలు పడాల్సిన పరిస్థితి. ఈ సమస్య పరిష్కారానికి జేతంచెర్ల కొండలపై నుంచి వచ్చే వరదనీటిని ఒడిసిపట్టుకుని భూగర్భజలాలు పెంచేందుకు 1992లో ఏటిపాయవాగుపై చెక్‌డ్యామ్ నిర్మించారు. అయితే, కట్టిన నాలుగేళ్లకే 1996లో భారీ వరదలు రావడంతో డ్యామ్ పూర్తిగా కొట్టుకోపోయింది. తర్వాత పునర్నిర్మాణానికి పాలకులు చర్యలు చేపట్టలేదు. అధికారులు ప్రతిసారి చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నా కార్యరూపం దాల్చ లేదు.

ఒకప్పుడు రెండుకార్ల పంటలు

ఏటిపాయ వాగు 149.47 ఎకరాల విస్తర్ణంలో ప్రవహిస్తుంది. వాగు వెంట 1674.89 ఎకరాల పట్టా భూములు ఉండగా ఇందులో 996.37 ఎకరాలు వ్యవసాయ భూమి. ఈ భూముల్లో పంటల సాగుకు మొత్తం 360 బోర్లు ఉన్నాయి. వాగుపై చెక్‌డ్యామ్ ఉన్న సమయంలో ఏడాది పొడవునా ఆ బోర్ల నుంచి పుష్కలంగా నీరు వచ్చేవి. దీంతో రైతులు ఏటా రెండుకార్లలో పంటలు పండించేవారు. ఇక్కడ ఇసుక నెలలు కావడంతో అధికంగా కూరగాయలు, పత్తి, మొక్కజొన్న, ఉద్యాన పంటలు సాగు చేసేవారు.

కలగా మారిన చెక్‌డ్యాం పునర్నిర్మాణం

1996లో చెక్‌డ్యామ్ కొట్టుకుపోవడంతో బోర్లలో సరిగ్గా నీరు రావడం లేదు. వర్షాకాలంలో కూడా అంతంత మాత్రంగానే వాటిలో నీళ్లు వస్తున్నాయి. ఒకప్పుడు రెండు పంటలు పండించుకున్న రైతులు నీటి సమస్యతో ఒక పంటకే పరిమితమయ్యారు. వాగులో నీటి ప్రవాహం ఉన్న సమయంలో మాత్రమే మంచి నీటి బోర్లు రీచార్జ్ అవుతుండటంతో వేసవికాలంలో తాగునీటి సమస్య ఉత్పన్నమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇదే మాదిరిగా సాగు నీటి కష్టాలు కూడా తీర్చేందుకు ఏటిపాయపై చెక్‌డ్యామ్ నిర్మాణంపై దృష్టి సారించారు.

కార్యరూపం దాల్చనున్న ఎన్నికల హామీ:

తమ్మరాజుపల్లె వాసులకు కలగా మారిన ఏటిపాయ చెక్‌డ్యాం నిర్మాణంపై గత ప్రభుత్వం కనీసం అధికారులతో సర్వే కూడా చేయించలేదు. గ్రామస్తులు అధికారులకు పదేపదే ప్రతిపాదనలు పంపినా ఎలాంటి చొరవ తీసుకోలేదు. ఇదే విషయాన్ని 2019 ఎన్నికల సమయంలో స్థానికులు కాటసానిరాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో అధికారంలోకి వస్తే ఏటిపాయ చెక్‌డ్యామ్ కడుతానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం చెక్ డ్యాం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఇటీవల మైనర్ ఇరిగేషన్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నిర్మాణానికి రూ.3.25 కోట్లు అవసరమవుతాయని అంచనాలు తయారు చేసి పంపించారు. కాగా చెక్‌డ్యాం నిర్మిస్తే గ్రామంలో ప్రతి ఎకరానికి సంవృద్ధిగా నీరు అందుతుందని రైతులు చెబుతున్నారు.

అనుమతి వచ్చాక పనులు

ఏటిపాయ చెక్‌డ్యామ్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, గ్రామ ప్రజా ప్రతినిధులు సూచనల మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించాం. నిర్మాణం జరిగితే అందే నీటి వనరుల గురించి పరిశీలించాం. నిర్మాణానికి సంబంధించి రూ.3.25 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశాం. దీనిని సీఈ అమోదం కూడా లభించింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే పనులు మొదలుపెడతాం.

– అర్జున్‌సింగ్ ఏఈ మైనర్ ఇరిగేషన్

మూడు క్షేత్రాల్లో కరివేన అన్నదాన సత్రాలు

శ్రీశైలం: ప్రముఖ పుణ్యక్షేత్రాలైన హరిద్వార్, అయోధ్య, అన్నవరం క్షేత్రాల్లో అఖిల భారత కరివేన బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఎస్ఆర్ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక కరివేన సత్రంలో ఏర్పాటు చేసిన వార్షిక సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కరివేన నిత్యాన్నదాన సత్రాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయన్నారు. శ్రీశైలంలో మరో అదనపు భవనం, అరుణాచలం, భద్రాచలంలలో కొత్త భవనాలను నిర్మించాలని తీర్మానించినట్లు చెప్పారు. ప్రస్తుతం హరిద్వార్, అయోధ్య, అన్నవరంలో అద్దె భవనాల్లో సత్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాటికి శాశ్వత భవనాలు నిర్మించాలని కమిటి తీర్మాణించామని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి డా.ఎస్ వేణుగోపాల్, గౌరవాధ్యక్షులు కామరాజు, నరేంద్రకుమార్,కోశాధికారి హరిహరరావు, ఉపాధ్యక్షులు మాధవరావు, మారుతి ప్రసాద్ , సహాయకార్యదర్శులు చిదంబరం, రామకృష్ణ, సభ్యులు ప్రదీప్,రఘు, సతీష్ శర్మ, మనోహర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్